

దిలావర్‌పూర్ : ఇంద్రకరణ్‌రెడ్డిని కలిసిన నాయకులు, అభిమానులు

## ఇంద్రకరణ్‌రెడ్డిని కలిసిన నాయకులు

దిలావర్‌పూర్, డిసెంబర్ 2: దిలావర్‌పూర్, కాల్వ, సిర్గాపూర్, బన్సపల్లి, కంజర్, సాంగ్వీ, సముందర్‌పల్లి గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ మండల. గ్రామ నాయకులు శనివారం నిర్మల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని తన నివాసంలో కలిశారు. గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ ప్రచార వ్యూహాలు, గ్రామాల వారీగా జరిగిన పోలింగ్, పార్టీ కోసం పనిచేసిన అభిమానుల గురించి ఆయనకు వివరించారు. ప్రతి గ్రామంలో కార్యకర్తలు, అభిమానులు కలిసికట్టుగా పనిచేశారని ఆయనకు వివరించారు. మంత్రిని కలిసిన వారిలో సహకార సంఘం చైర్మన్ పీవీ రమణరెడ్డి, పాల్దె అనిల్, దనే రవి, మైనార్టీ నాయకులు అన్వర్‌ఖాన్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు బాబురావు, నాయకులు సక్కారాం, శ్యాంసుందర్‌రెడ్డి, విఠల్, గంగారెడ్డి, శ్రీనివాస్, మహేశ్, నర్సయ్య, తదితరులు ఉన్నారు.

# ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

- ఆదిలాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న

జైనథ్, డిసెంబర్ 2 : ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆదిలాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్‌లోని సుప్రసిద్ధ శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన సామూహిక సహస్ర సత్యనారాయణ స్వామి వ్రతంలో ఎమ్మెల్యే జోగు రామన్న సతీ సమేతంగా కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పూజ కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రసిద్ధ శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో రథోత్సవం



పూజలు చేస్తున్న ఆదిలాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న దంపతులు

ఘనంగా సాగిందని, ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడు సైతం సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆలయంలో నిర్వహించామని తెలిపారు. ప్రజలంతా సుభిక్షంగా జీవించాలని ఆ భగవంతుడిని మన స్ఫూర్తిగా ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆనందంగా, సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించడంపై అభినందనలు తెలిపారు.

# బోథ్‌లో ధర్మమే గెలుస్తుంది..

- సీఎం కేసీఆర్‌కు పూర్తి మద్దతు
- బోథ్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్

తాంసి(తలమడుగు), డిసెంబర్ 2 : బోథ్ నియోజకవర్గంలో ధర్మమే గెలుస్తుందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్ విశ్వాసం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పేదల పక్షపాతి అయిన సీఎం కేసీఆర్‌కు మద్దతిచ్చారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి మాట్లాడారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా డబ్బు, మద్యంతో ఎన్నికల్లో గెలిచేందుకు ఎన్నిఎత్తులు వేసిన వాటిని ప్రజలు పటాపంచలు చేశారన్నారు. బోథ్ నియోజకవర్గంలో గతంలో ఎప్పుడూ లేని విధంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టినట్టు తెలిపారు. నిస్వార్థంగా తాను చేసిన సేవకు గుర్తింపుగా ఓటర్లు ఓటు వేశారని పూర్తి నమ్మకం తనకు ఉందని ఆయన స్పష్టం చేశారు. తన



విజయ సంకేతం చూపిస్తున్న బోథ్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్

గెలుపు కోసం రెండు నెలలుగా ప్రచారంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. వారి వెంట బీఆర్‌ఎస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి చింతలపెల్లి దేవారెడ్డి, రవికాంత్ యాదవ్, బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్‌కుమార్, సర్పంచ్ స్వప్న రత్నప్రకాశ్, ఉప సర్పంచ్ ప్రశాంత్, దేవీదాస్, తిరుపతి, మున్న, రాజు, చందు, అక్షయ్, నిమ్మల సుదర్శన్ రెడ్డి, గంగాధర్, గోక ప్రకాశ్ రెడ్డి, బాదుర్ నర్సింహులు, జువ్వాక నర్సింహులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా జోనల్ స్థాయి
# క్రికెట్ ఎంపిక పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 2 : ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శనివారం అండర్ –17 బాలుర జోనల్ స్థాయి క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఉమ్మడి జిల్లా నుంచి పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంతారావు, స్వామి, జయేంద్ర, విఠల్ రెడ్డి పాల్గొన్నారు.

## ఆసిఫాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థిని కలిసిన నాయకులు



ఆసిఫాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవలక్ష్మితో నాయకులు

నార్నూర్, డిసెంబర్ 2 : నార్నూర్ మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు శనివారం ఆసిఫాబాద్‌లో నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. కలిసిన వారిలో సహకార సంఘం ఇన్‌చార్జి చైర్మన్ ఆడే సురేశ్, మాజీ జడ్పీటీసీ రూపావతి జ్ఞానోబాపుష్కర్, ఐటీ డీఏ డైరెక్టర్ మడావి మాన్కు, కోఆప్షన్ సభ్యుడు షేక్ దస్తగిరి, నాయకులు చంద్రశేఖర్, మసూద్, తదితరులు ఉన్నారు.

# చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ఎదులాపురం, డిసెంబర్ 2 : చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని సఖీ కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలలు, మావలలోని ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు సఖీ కేంద్రం సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ లింగ వివక్షత చూపించవద్దన్నారు. సఖీ కేంద్రంలో వచ్చిన బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్, బాల్యవివాహ చట్టం, గృహహింస చట్టం, సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. బాధితులకు 181,100,1098,14567,1930 నంబర్ల



అవగాహన కల్పిస్తున్న సఖీ కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి

గురించి తెలపడం జరిగిందన్నారు. జిల్లా కో ఆర్డినేటర్ పవార్ యశోద మాట్లాడుతూ మహిళా సాధికారత పొందాలంటే చదువుతో పాటు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రేవరల్ ఫాదర్ , జీన్స్ థామస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రోగులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

ఎదులాపురం, డిసెంబర్ 2 : రిమ్స్‌కు వచ్చే రోగులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ వైద్యులకు సూచించారు. శనివారం రిమ్స్‌లోని పలు వార్డులను సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రభుత్వ దవాఖానకు రోగులు ఎంతో నమ్మకంతో వస్తారని తెలిపారు. రోగులకు సంబంధించిన అన్ని వివరాలు సేకరించి వైద్య పరీక్షలతో పాటు చికిత్సలు అందించాలన్నారు. వారి వెంట ఆర్‌ఎంవో డాక్టర్ రాహుల్, తదితరులు ఉన్నారు.



చికిత్స పొందుతున్న రోగితో మాట్లాడుతున్న రిమ్స్ డైరెక్టర్, సూపరింటెండెంట్

## వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 2: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అంకోలి పీహెచ్‌సీ డాక్టర్ సర్ఫరాజ్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని మామిడిగూడ ఆశ్రమ పాఠశాలలో జలుబు, దగ్గు, జ్వరం, దురద కలిగిన విద్యార్థులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకుడు బొమ్మెత సుభాష్, ఆరోగ్య సహాయకుడు పవార్ ప్రేమ్ సింగ్, ఆశ కార్యకర్త రుక్మిణి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు మద్యం దుకాణాలు బంద్

ఎదులాపురం,డిసెంబర్ 2 : అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఆదివారం ఉదయం 6 నుంచి కౌంటింగ్ పూర్తయ్యే వరకు మద్యం దుకాణాలు మూసివేయాలని ఆదేశించినట్లు ఎక్సైజ్ సీఐ సీహెచ్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని షాపుల యజమానులు ఈ నిబంధనలు పాటించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.